# రంగసముద్రాన్ని పునరుద్ధరిస్తాం

- 15.70 లక్షలతో ఫీడర్ చానల్, కట్ట నిర్మాణం
- నీటిపారుదల శాఖ డీఈ సమ్మయ్య వెల్లడి
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన



సోమవారం రంగ సముద్రం చెరువును పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 22 (నమస్తే తెలంగాణ): అక్రమార్కుల కారణంగా నీరు చేరక.. చెరువు ఎండిపోయి ఊరు ఎడారిలా మారుతున్న వైనంపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'రియల్ వలలో రంగసముద్రం విలవిల' అనే కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గిరికొత్తపల్లిలోని రంగ సముద్రం చెరువును పునరుద్ధరిస్తామని ప్రకటించారు. ఈ మేరకు కల్వకుర్తి సర్కిల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమ్మయ్య, ఏఈ చంద్రకాంత్ సోమవారం రంగ సముద్రం చెరువును పరిశీలించారు. చెరువు ధ్వంసమైన తీరును పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం డీఈ మాట్లాడుతూ.. రంగ సముద్రం చెరువు పునరుద్ధరణ కోసం ప్రాథమికంగా అంచనాలు రూపొందించామని తెలిపారు. ఫీడర్ చానల్, కట్ట, ఇతరత్రా నిర్మాణాల పునరుద్ధరణకు రూ.15.70 లక్షల వరకు అవసరం అవుతుందని వెల్లడించారు.

### రెవెన్యూ, పోలీసు శాఖతో సంప్రదింపులు

గతంలో సమృద్ధిగా నీటితో ఉండే చెరువు మడుగులా తయారైన వైనాన్ని పలువురు రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు వివరించారు. చెరువులోకి వరద నీరు రాకుండా నిర్మాణాలను ధ్వంసం చేయడంతోపాటు తిరిగి తమపైనే కేసులు పెట్టారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులతో ఇరిగేషన్ అధికారులు మాట్లాడారు. మాడ్గుల సీఐని కలిసి చెరువు ఫీడర్‌చానల్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులను విచారించాల్సిందిగా కోరారు. సీఐ వారితో మాట్లాడేందుకు ప్రయత్నించగా.. మధ్యాహ్నం తర్వాత వస్తామని చెప్పి, ఆపై రాలేదని తెలిసింది. దీంతో మంగళవారం మరోసారి వారిని పిలిపించి విచారిస్తామని తెలిపారు. మరోవైపు చెరువు శిఖం కాకుండా ఏకంగా చెరువులోనే పట్టా భూమి ఉన్నదని కొందరు వ్యక్తులు చెప్తున్నారనే విషయాన్ని డీఈ ప్రస్తావించారు. దీనిపై విచారించగా, సదరు వ్యక్తులకు సర్వేనంబరు 3లో పట్టా పాసు పుస్తకాలు ఉండగా.. చెరువు భూములు ఉన్న సర్వేనంబరు 33లో క్లెయిమ్ చేస్తున్నారని పలువురు రైతులు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. అధికారులు లోతుగా విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. చెరువును పునరుద్ధరించకపోతే ఈ వేసవిలో గ్రామంలో నీటి ఎద్దడి తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేతో కలిసి మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

## అసెంబ్లీలో బడుగులకు స్థానం ఇవ్వరా?

- స్ఫూర్తిదాయక వీరులకు ఇచ్చే గౌరవం ఇదేనా?
- రాజకీయాలకు అతీతంగా మరో పోరాటం సాగిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్సీ కవిత కౌంటర్



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహం ఏర్పాటు విషయంలో ఎందుకు రాజకీయ రంగు పులుముతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. భారత జాగృతి సంస్థ కోరడమే మీకు అభ్యంతరమా? లేక అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయడమే అభ్యంతరమా? అని సోమవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. స్ఫూర్తిదాయక వీరులకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా? అని నిలదీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే జాగృతి సంస్థ ద్వారా పోరాటం చేసి అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించామని, ఇప్పుడు కూడా పూలే విగ్రహ ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా మరో పోరాటం సాగిస్తామని తెలిపారు. భవిష్యత్‌లో రాజకీయాల కోసం, సంకుచిత మనస్తత్వంతో ఈ మహాకార్యాన్ని అవహేళన చేయరని ఆశిస్తున్నానని తెలిపారు. పూలే మహోన్నతుడు. అణగారిన ప్రజల్లో చైతన్యం నింపిన మహా మనిషి. అందుకే ఏప్రిల్ 11 నాటికి పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని విన్నమంగా కోరుతున్నానని ట్వీట్ చేశారు.

## బీసీల సలహాలు కాంగ్రెస్ సర్కారుకు వద్దా?

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఇటీవల నియమించిన ప్రభుత్వ సలహాదారుల్లో కాంగ్రెస్ బీసీలకు ఒక్కరికీ అవకాశం కల్పించకపోవడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలిచ్చే అర్హత బీసీలకు లేదా?బీసీల సలహాలు ప్రభుత్వానికి అక్కర్లేదా? అని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని, మంత్రివర్గంలో ఇద్దరికే అవకాశం కల్పించారని, అడ్వకేట్ జనరల్‌గా, అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా బీసీలకు ఒక్కరికీ అవకాశం కల్పించలేదని ధ్వజమెత్తారు. కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ బీసీలకు అవకాశాలు ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ ఆలోచించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ అధికారం దామాషా పద్ధతిలో పాలనలో భాగస్వామ్యం కల్పించాలని ఒకవైపు చెబుతుంటే, అందుకు విరుద్ధంగా తెలంగాణ సర్కారు ఏకపక్షంగా ఒకే కులం వారికి పదవులు కట్టబెట్టడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. ఇకనైనా మంత్రివర్గ విస్తరణలో బీసీలకు దామాషా పద్ధతిన స్థానం కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు.

## నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేస్తా

- ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): తనకు ఎంపీగా పోటీచేసే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పిస్తుందని, నాగర్‌కర్నూల్ నుంచి బరిలో ఉంటానని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి చెప్పారు. సోమవారం ఆయన ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌తో కలిసి సచివాలయంలోని మీడియా పాయింట్‌లో మాట్లాడారు. తమకు ప్రభుత్వ సలహాదారులుగా, ప్రత్యేక ప్రతినిధిగా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాజీవ్‌గాంధీ హయాంలోనే రామమందిర నిర్మాణానికి పునాదులు పడ్డాయని, కోర్టు కేసుల వల్ల పెండింగ్ పడిందని గుర్తుచేశారు. రామాయణం, సుందరాకాండ భారతీయుల డీఎన్ఏలోనే ఉన్నదని, మోదీ కొత్తగా దేశ ప్రజలకు చెప్పాల్సింది.. ఆయన నుంచి వాళ్లు నేర్చుకోవాల్సింది ఏమీ లేదని అన్నారు.

## అంగన్‌వాడీ గుడ్ల విక్రేతపై కేసు నమోదు

కులకచర్ల, జనవరి 22: 'అంగన్వాడీ అమ్మకానికి కోడి గుడ్లు' అనే శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి వికారాబాద్ డీడబ్ల్యూవో లలితకుమారి స్పందించారు. అంగన్‌వాడీ గుడ్లను మార్కెట్‌లో విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ గుడ్లపై ప్రభుత్వ ముద్ర ఉంటుందని, ఎక్కడ విక్రయించినా పట్టుకోవచ్చని తెలిపారు. చౌడాపూర్‌లో గుడ్లను విక్రయించిన మందిపల్లి చెందిన పెంటయ్యపై తమ సూపర్‌వైజర్ శివలీల, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి కేసు నమోదు చేయించారని తెలిపారు. అవి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కోడి గుడ్లని విచారణలో తేలిందని చెప్పారు. అదే విధంగా చౌడాపూర్‌లో 2011 నుంచి ఆధార్‌కార్డులు పంచకుండా పడేసిన పోస్టుమ్యాన్‌పైనా క్రిమినల్ కేసు పెట్టించామని తహసీల్దార్ పేర్కొన్నారు.

# ధరలు పెంచకుండా ఎక్సైజ్ ఆదాయం

- ఎలైట్ బార్‌ల ఏర్పాటుకు మార్గదర్శకాలు ఇవ్వండి
- టెంపుల్ టూరిజం అభివృద్ధికి కృషి చేయండి
- ప్రీ బడ్జెట్ సమీక్షలో భట్టి విక్రమార్క



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మద్యం ధరలు పెంచకుండా ఎక్సైజ్ శాఖ ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. సచివాలయంలో సోమవారం మంత్రి జూపల్లి కృష్ణారావు, సంబంధిత శాఖ అధికారులతో బడ్జెట్ అంచనాలపై సమీక్షించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలైట్ బార్‌లు/ఎలైట్ షాప్‌లు వంటివి నెలకొల్పడానికి ఏకీకృత విధానంలో ఒక వ్యవస్థను ఏర్పాటుచేసి మార్గదర్శకాలను రూపొందించాలని చెప్పారు. ఎక్సైజ్, పోలీసు, సమాచార శాఖలతో కూడిన మల్టీడైమెన్షనల్ టీమ్‌లను ఏర్పాటుచేసి డ్రగ్స్ ముప్పుపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అన్నారు. డ్రగ్స్ ముప్పును అరికట్టేందుకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధి చెందాలంటే ఎండోమెంట్, టూరిజం, ఆర్టీసీ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా సహజసిద్ధమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పటికీ సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం వలన వాటిని సరిగా ఉపయోగించుకోలేకపోతున్నామని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మాత్రమే అన్ని టూరిజం ప్రాజెక్టులను చేపట్టలేదని, పర్యాటక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెట్టేలా మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సమీక్షలో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎక్సైజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, టూరిజం అండ్ కల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, ఎక్సైజ్, టూరిజం, కల్చర్, ఆర్కియాలజీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సంపద సృష్టికర్తలను ఇబ్బందిపెట్టం

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని తెచ్చే సంపద సృష్టికర్తలను ఏమాత్రం ఇబ్బంది పెట్టబోమని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ తెలంగాణ విభాగం ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో భట్టి విక్రమార్కను కలిసింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ థేమ్స్ నదిలా మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తాము సంకల్పించామని, దీనితో పాటు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల హైదరాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మూసీ నది శుద్ధితో సుందరీకరణ జరిగి, పర్యాటకం మరింత అభివృద్ధి చెందుతుందని, ఫుడ్ కోర్టులు, ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్లు జరిగే అవకాశం ఉందని తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు హైదరాబాద్ ప్రధాన శక్తిగా మారుతుందని అన్నారు. డబ్బులు కట్టి గత రెండు మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కొన్ని ప్రతిపాదనలను మంత్రికి నివేదించింది. కౌన్సిల్ తెలంగాణ విభాగం ప్రతినిధులు మేకా విజయసాయి, కే శ్రీధర్ రెడ్డి, కాళీ ప్రసాద్, దశరథ్ రెడ్డి, చలపతి రావు, భూపాల్ రెడ్డి, మారోజు శ్రీధర్ రావు, అశోక్, రామిరెడ్డి వెంకట్ రెడ్డి, కేకే రెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకేతో భేటీ
- రాష్ట్రంలో తాజా రాజకీయాలపై చర్చ

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ నెల 15న దావోస్‌కు వెళ్లిన రేవంత్.. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో 3 రోజులపాటు పాల్గొని అక్కడి నుం చి లండన్ వెళ్లారు. అక్కడ రెండురోజులపాటు గడిపిన సీఎం.. థేమ్స్ నది అభివృద్ధికి తీసుకున్న చర్యలపై రాష్ట్ర అధికారులతో కలిసి అధ్యయనం చేశారు. కాంగ్రెస్ అనుకూల ప్రవాస తెలంగాణ వాసులు ఏర్పాటుచేసిన 'హలో లండన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి దుబాయ్‌కి వెళ్లిన సీఎం సోమవారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

### కర్ణాటక డిప్యూటీ సీఎం డీకేతో భేటీ

హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే, సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. రేవంత్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ భేటీలో తాజా రాజకీయాలు, లోక్‌సభ ఎన్నికలు, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ, కాంగ్రెస్ సంస్థాగత అంశాలపై చర్చ జరిగినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ ఇద్దరూ కలిసి సాయంత్రం హబ్సిగూడలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో 'కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్' ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ డీకే ఒక్కరే హాజరయ్యారు. విదేశీ పర్యటన బడలిక కారణంగా రేవంత్ రెడ్డి రాలేకపోయారని డీకే తెలిపారు.

## రాహుల్‌గాంధీపై దాడి హేయం: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): భారత్ న్యాయ్ యాత్రలో భాగంగా అస్సాంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై స్థానిక బీజేపీ స్పాన్సర్డ్ దాడి హేయమని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాహుల్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం, గుడి సందర్శనకు అనుమతి ఇవ్వకపోవడం శోచనీయమని సోమవారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అలాంటి ధోరణి మంచిది కాదని హితవు పలికారు. రాహుల్ భద్రత విషయంలో సైతం అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని, అలాంటి చర్యలతో ఆయన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలన్న కుట్రలు ఫలించబోవని పేర్కొన్నారు. మరింత మనోధైర్యంతో రాహుల్ ముందుకు సాగుతారని వెల్లడించారు. లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉన్నారని తెలిపారు.

## ఎస్బీ పరువు తీసిన నకిలీ పాస్‌పోర్టులు

- 92 మంది ఆచూకీ కోసం ఇంటర్‌పోల్ సహకారం
- అంతర్గత విచారణలో మరిన్ని బయటపడే అవకాశం

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఇటీవల అతిపెద్ద నకిలీ పాస్‌పోర్టు రాకెట్‌ను ఛేధించిన తెలంగాణ సీఐడీ పోలీసులు.. బోగస్ పత్రాలతో విదేశాలకు వెళ్లిన 92పై దృష్టి సారించారు. మరోవైపు ప్రాథమిక విచారణలోనే 92 మందికి నకిలీ పాస్‌పోర్టులు అందించినట్టు వెల్లడించిన నిందితులు.. పూర్తిస్థాయి విచారణలో ఇంకా ఎన్ని పేర్లు బయటపెడతారోనన్న ఉత్కంఠ నెలకొంది. నకిలీ పాస్‌పోర్టులు పొందినవారు దేశంలోనే ఉన్నారా? లేక విదేశాలకు వెళ్లారా? ప్రస్తుతం వీరు ఎక్కడైనా పనిచేస్తున్నారా? లేక ఉగ్రవాద సంస్థల్లో చేరారా? అన్న దానిపై దర్యాప్తు కొనసాగుతున్నది. పాస్‌పోర్టు ఏజెంట్లు ఈసీఎన్‌ఆర్ క్యాటగిరీలో దరఖాస్తు చేయడం కస్టమర్ల ఫోన్ నంబర్లకు బదులుగా తమ ఫోన్ నంబర్లను ఇవ్వడంతో దర్యాప్తు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులు పొందినవారిని పట్టుకోవడం సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కాసుల కక్కుర్తితో ఎస్బీకి అప్రతిష్ట..

దొంగలతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు కుమ్మక్కు అయ్యారనే విషయంపై రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు చాలా సీరియస్‌గా ఉన్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పోలీసులు అంతర్గత విచారణకు ఆదేశించడంతో, సదరు ఎస్బీ అధికారుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టినట్లు తెలిసింది. రాష్ట్రంలో సగటున రోజుకు 3 వేల మందికిపైగా పాస్‌పోర్టు పొందేందుకు దరఖాస్తు చేస్తున్న క్రమంలో ఎస్బీ విచారణ వ్యవస్థపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. పోలీసు కస్టడీతోనే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

## శ్రీకృష్ణ దేవాలయం కోసం రాజస్థాన్ మంత్రి దీక్ష

కోట (రాజస్థాన్): ఉత్తర ప్రదేశ్‌లోని మథురలో ఉన్న శ్రీకృష్ణ జన్మస్థానంలో శ్రీకృష్ణునికి దేవాలయం నిర్మించే వరకు దీక్ష చేస్తానని రాజస్థాన్ విద్యా శాఖ మంత్రి మదన్ దిలావర్ సోమవారం చెప్పారు. దీక్షలో భాగంగా రోజుకు ఒంటి పూట భోజనం మాత్రమే చేస్తానని చెప్పారు. ఈ దీక్షను నేటి నుంచే ప్రారంభిస్తున్నానని తెలిపారు.



## ఎమ్మెల్సీలుగా వెంకట్, మహేశ్‌గౌడ్

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా బల్మూరి వెంకట్, మహేశ్‌కుమార్‌గౌడ్ ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం వారికి ధ్రువపత్రాలను అందించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలుగా ఉన్న కౌశిక్‌రెడ్డి, కడియం రాజీనామా చేయడంతో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బీ వెంకట్, మహేశ్‌కుమార్‌గౌడ్ మాత్రమే నామినేషన్లు వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఆ అధికారం కోర్టులకు లేదు

న్యూఢిల్లీ, జనవరి 22: పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని నోటిఫై చేయాలని ప్రభుత్వాన్ని కోర్టులు ఆదేశించలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దివాలా కోడ్‌లోని ముఖ్యమైన నిబంధనలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)ను కోర్టు కొట్టివేసింది. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని నోటిఫై చేయడం ప్రభుత్వంపై ఆధారపడి ఉంటుందని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. అమలుచేయాలని ఆదేశించడం కోర్టుల అధికార పరిధికి మించినదని, ఇది విధాన పరిధిలో ఉంది కాబట్టి దానిని తాము నిర్దేశించలేమని పేర్కొన్నది.

## బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు



హైదరాబాద్,జనవరి 22 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకం అమలుకు బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధంచేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం ఆయన ఉన్నతాధికారులతో సమావేశమై బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. రవాణా శాఖ ఆదాయ, వ్యయాలు, గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు, కొత్త బస్సుల కొనుగోలు, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పాలసీలు తదితర అంశాలపై రవాణా, ఆర్టీసీ ఉన్నతాధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతర మంత్రి పొన్నం మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రతిపాదనలపై ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన త్వరలో జరుగనున్న సమావేశానికి పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని అధికారులకు సూచించారు. పీఎఫ్, సీసీఎస్, బాండ్స్‌కు బడ్జెట్‌లో అవసరమైన కేటాయింపుల గురించి ప్రభుత్వానికి వివరించాలని తెలిపారు. సమావేశంలో రవాణా శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు, ఆర్టీసీ ఎండి సజ్జనార్‌తోపాటు ఆర్టీసీ, రవాణా శాఖ హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు

- సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలోని బీజేపీని ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ కమిటీ కన్వీనర్ పశ్య పద్మ పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల వేదిక పిలుపులో భాగంగా ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా ట్రాక్టర్, వాహనాల ర్యాలీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో పశ్య పద్మ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మోర్చా కన్వీనర్లు టీ సాగర్, బాల మల్లేశ్, రాయల చంద్రశేఖర్, బిక్షపతి, జక్కుల వెంకటయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. 26న హైదరాబాద్‌లో సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

# పారిశ్రామిక రాయితీలపై నీలినీడలు

- ఐడియా, టీ-ప్రైడ్ కింద 2,500 కోట్ల బకాయిలు
- ఎస్సీ, ఎస్టీలకు చెల్లించాల్సిన బకాయిలే 1,000 కోట్లు



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న రాయితీలపై నీలినీడలు కమ్ముకున్నాయి. టీ-ఐడియా, టీ-ప్రైడ్ పథకాల కింద దాదాపు రూ.2,500 కోట్ల సబ్సిడీ బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు సంబంధించిన టీ-ప్రైడ్ రాయితీలే రూ.1,000 కోట్ల వరకు ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రాయితీలన్నీ నిలిచిపోవడంతో ఆయా లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బ్యాంకు రుణాలు తీర్చలేక సతమతమవుతున్న తమకు రాయితీలు కూడా నిలిచిపోవడంతో సకాలంలో కరెంటు బిల్లులు, లేబర్ చార్జీలు చెల్లించలేకపోతున్నామని వాపోతున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీలన్నీ విడుదల చేయాలని కోరుతున్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంస్కరణలను ప్రవేశపెట్టింది. పారిశ్రామిక అనుమతులను సులభతరం చేసేందుకు టీఎస్-ఐపాస్ పేరుతో సింగిల్ విండో విధానాన్ని అమలు చేయడంతోపాటు టీ-ప్రైడ్ ద్వారా దళిత, గిరిజన, వికలాంగులకు, టీ-ఐడియా ద్వారా జనరల్ క్యాటగిరీ వారికి అనేక రాయితీలను అందించింది. ఇందుకోసం 2014-15 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు రూ.6,837 కోట్లు విడుదల చేయడంతో దాదాపు 90 వేల మంది లబ్ధిపొందారు. ఇది కాకుండా విద్యుత్తు సబ్సిడీ, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా సుమారు రూ.9,500 కోట్ల వరకూ ప్రోత్సాహకాలను అందించిన కేసీఆర్ ప్రభుత్వం.. 2023-24 వార్షిక బడ్జెట్‌లో వాణిజ్య, పరిశ్రమల శాఖకు రూ.4,037 కోట్లు కేటాయించింది. అందులో వివిధ రాయితీలకే రూ.3,519 కోట్లు నిర్దేశించింది. కానీ, ప్రస్తుతం ప్రతి పనికీ నిధుల కొరత ఉన్నదని చెప్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. గతంలో పరిశ్రమలకు అందించిన ప్రోత్సాహకాలను కొనసాగిస్తుందా? లేదా? అన్న దానిపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# మెట్రో రెండోదశకు గ్రీన్‌సిగ్నల్




రెండో దశలో చేపట్టే మెట్రో కారిడార్ల కొత్త రూట్ మ్యాప్

మొదటిపేజీ తరువాయి...

రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గం (31 కి.మీ)ను నిలిపివేసి, దానికి బదులుగా రాయదుర్గం నుంచి నానక్‌రాంగూడ మీదుగా ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ వరకు 8 కి.మీ మార్గంలో మెట్రోను నిర్మించాలని ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతోపాటు ఇతర మార్గాలకు సంబంధించిన తుది రూట్ మ్యాప్‌ను సీఎం ఆదేశాలతో హైదరాబాద్ మెట్రో అధికారులు సిద్ధం చేశారు. ఏయే ప్రాంతాల నుంచి ఏయే మార్గాల్లో మెట్రో విస్తరించనున్నదో తెలియజేసేలా మ్యాప్‌ను తయారుచేసి సోమవారం విడుదల చేశారు. హైదరాబాద్ మెట్రో ప్రస్తుతం మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లు అందుబాటులో ఉన్నది. మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్, నాగోల్ టు రాయదుర్గ్ వరకు మెట్రో కనెక్టివిటీ ఉన్నది. రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఉన్న కారిడార్-2ను చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు వరకు పొడిగిస్తారు. దీనికి తోడు కొత్తగా మరో నాలుగు కారిడార్లలో మెట్రోరైలు రూట్ నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తంగా రెండో దశలో 70 కి.మీ దూరంతో కొత్త మెట్రో రైలు మార్గాలను నిర్మించేలా ఈ ప్రతిపాదనలను మెట్రో అధికారులు రూపొందించారు. కాగా ఇప్పటికే మొదటి దశలో ఉన్న కారిడార్-2(జేబీఎస్-ఫలక్‌నుమా)ను అదే పేరుతో చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇక మిగతా కారిడార్లకు కారిడార్-4 నుంచి కారిడార్-7 వరకు వాటి మార్గాలను నిర్దేశించారు.

### శరవేగంగా డీపీఆర్ల తయారీ: ఎన్వీఎస్ రెడ్డి

కొత్తగా ఖరారు చేసిన 70 కి.మీ మెట్రో మార్గానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు-డీపీఆర్)ను శరవేగంగా రూపొందించేందుకు చర్యలు తీసుకున్నామని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మరో 3 నెలల్లోనే డీపీఆర్‌లను సిద్ధం చేస్తామని చెప్పారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీని విస్తరించడం ద్వారా భారీ సంఖ్యలో పేద, మధ్యతరగతి వర్గాలకు మెట్రో రైలు సేవలను అందించాలనే ప్రభుత్వం లక్ష్యం నేరవేరుతుందని చెప్పారు.

### 66 కి.మీ అత్యంత పొడవైన కారిడార్‌గా.

మొదటి దశలోని కారిడార్-3 (నాగోల్ - రాయదుర్గం) 29 కి.మీ ఉండగా, రెండో దశలో నిర్మించే మెట్రో మార్గాలతో కలిపి మొత్తం 66 కి.మీ పొడవుతో నగరంలోనే అత్యంత పొడవైన మెట్రో మార్గంగా మారనున్నది. ఇందులో నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు 29 కి.మీ, అదేవిధంగా రాయదుర్గం నుంచి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ వరకు 8 కి.మీ కలిపి మొత్తం 66 కి.మీ మెట్రో మార్గం అనుసంధానం కానున్నది. ఆ తర్వాత మొదటి దశలో కారిడార్-1 (మియాపూర్-ఎల్‌బీనగర్ 29 కి.మీ) రెండు వైపులా ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 8 కి.మీ, మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరువు వరకు మరో 14 కి.మీ కలిపి మొత్తం 51 కి.మీ పొడవుతో నిర్మాణం కానున్నది.

### రెండో దశలో చేపట్టే మెట్రో కారిడార్లు( కొత్త రూట్ మ్యాప్)

- *కారిడార్ 2: ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు (5.5 కిలో మీటర్లు)*
- *కారిడార్ 2: ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు వరకు (1.5 కిలోమీటర్లు)*
- *కారిడార్ 4: నాగోల్ మెట్రోస్టేషన్ నుంచి ఎల్‌బీనగర్ మెట్రోస్టేషన్ వరకు, అక్కడినుంచి చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్డు, మైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (మొత్తం 29 కిలోమీటర్లు)*
- *కారిడార్ 4: మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు (4 కిలోమీటర్లు)*
- *కారిడార్ 5: రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి బయోడైవర్సిటీ జంక్షన్, నానక్‌రామ్‌గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ వరకు 8 కిలోమీటర్లు)*
- *కారిడార్ 6: మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు (14 కిలోమీటర్లు)*
- *కారిడార్ 7: ఎల్‌బీ నగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్ నగర్ వరకు (8 కిలోమీటర్లు)*